సమాచారమ్

వ్యవస్థాపక సంపాదకులు : గంధం సీతారామాంజనేయులు
సంపాదకులు : గంధం నాగ సుబ్రహ్మణ్యం (1987-2004)

Phones : Rajahmundry : 2476991, 98489 97335, 85000 06991 (Editorial), 85007 55958, 2475958(Advt), Kakinada : 98484 84192

సంపుటి : 64 సంచిక : 306 | రాజమహేంద్రి 31-3-2020 మంగళవారం | పేజీలు : 2 రూ. : 1-00

# విద్యార్థుల రక్షణ మరియు ఆరోగ్య పరిస్థితులపై ఉపకులపతి సమీక్ష

కాకినాడ మార్చి 30 : ప్రస్తుతం కరోన వ్యాధి వ్యాప్తి కారణంగా స్వీడన్ లోని బిటిహెచ్ విశ్వవిద్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ కోర్సులలో విద్యనభ్యసిస్తున్న 77మంది జెఎన్టియుకె విద్యార్థుల రక్షణ మరియు ఆరోగ్య పరిస్థితులపై గౌరవనీయులైన ఉపకులపతి ప్రొ.ఎం.రామలింగరాజు గారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బిటిహెచ్ అధికారులు మరియు జెఎన్‌టియుకె విద్యార్థులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సమీక్షలో రెక్టార్ ప్రొ.జి.వి.ఆర్.ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ప్రొ.సిహెచ్.సత్యనారాయణ, ఫారన్ యూనివర్శిటీ రిలేషన్స్ (ఎయుఆర్) డైరెక్టర్ ప్రొ.సిహెచ్.సాయిబాబు, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.బి.బాలకృష్ణ తదితరులు స్వీడన్లోని బిటిహెచ్ విశ్వవిద్యాలయ అధికారులతో సంభాషించారు.

స్వీడన్ లోని బిటిహెచ్ యూనివర్శిటీ నుండి డైరెక్టర్ ఆఫ్ ఇంటర్నేషనల్ అఫైర్స్ డా.మాట్స్ వాల్టర్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఇంటర్నేషనల్ అఫైర్స్ శ్రీ వేల్పుల గురుదత్, అంతర్జాతీయ సమన్వయకర్త మిస్ కార్మెన్ మరియు జెఎన్‌టియుకె విద్యార్థులు పాల్గొని తమ ఆరోగ్య పరిస్థితులను తదితర అంశాలను వివరించారు. బిటిహెచ్ విశ్వవిద్యాలయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ మరియు స్వీడిష్ ఆరోగ్య అధికారుల ఆదేశాలకు అనుగుణంగా మార్చి 18వ తేదీ నుండి కరోన వ్యాధికి సంబంధించి అన్ని నివారణ చర్యలు చేపట్టినట్లు బిటిహెచ్ అధికారులు తెలిపారు. అలాగే బిటిహెచ్‌లో అన్ని బోధనలను ఆన్లైన్ చేయడం జరిగిందని, విద్యార్థులు వారి ఇంటి వద్ద నుండే పరీక్షలు రాయవచ్చునన్నారు. భారతదేశంలో పరిస్థితులు చక్కబడిన తర్వాత విద్యార్థుల కోరిక మేరకు వారిని స్వదేశానికి పంపించి జెఎన్‌టియుకెలోనే పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు.

ఈ సందర్భంగా బిటిహెచ్ మరియు జెఎన్టియుకె అధికారులు కరోన వ్యాధి వ్యాప్తి చెందకుండా విద్యార్థులు క్షేమంగా ఉండేలా కట్టుదిట్టమైన నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు ఉపకులపతి ప్రొ.ఎం. రామలింగరాజు తెలిపారు.

ఈ నేపథ్యంలో ఉపకులపతి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యార్థులతో మాట్లాడి వారి యోగ క్షేమాలను తెలుసుకుని జాగ్రత్త వహించాల్సిందిగా పలు సూచనలు చేశారు.